

ఒకటి నుంచి 'సదరం' నిలుపుదల

నరసన్నపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే సదరం శిబిరాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి ఒకటో తేదీ నుంచి నిలుపుదల చేయాలని వైద్యఆరోగ్యశాఖ డైరెక్టర్ డా.అట్టాడ సిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'గత ప్రభుత్వ హయాంలో అనర్హులకు భారీగా దివ్యాంగుల పత్రాలు జారీ చేశారనే ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. జిల్లాలో పొందూరు, కోటబొమ్మాళి, జలుమూరు మండలాల్లో పలువురు అనర్హులకు దివ్యాంగ పత్రాలు జారీచేసినట్టు అధికారులు గుర్తించి.. వారికి పింఛన్లు నిలిపేశారు. నకిలీలకు అడ్డుకట్ట వేసి.. త్వరలో కొత్త విధానంలో అర్హులకు సదరం ధ్రువపత్రాలు జారీచేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంద'ని డా.అట్టాడ సిరి తెలిపారు.

మరణిస్తూ.. పునర్జన్మనిచ్చి..



- జిల్లాలో పెరుగుతున్న అవయవదాతలు
- స్వచ్ఛందంగా ముందుకొస్తున్న బాధిత కుటుంబ సభ్యులు
- 'జీవన్‌దాన్' ద్వారా అవయవాల తరలింపు
- ఎంతోమంది జీవితాల్లో వెలుగులు

● ఈ నెల 26న మందసకు చెందిన **కొంకి జోగారావు** అనే విద్యుత్ ఉద్యోగి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే శ్రీకాకుళంలో ఆస్పత్రికి తరలించగా ఆయన బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు గుర్తించారు. తల్లిదండ్రు లకు అవగాహన కల్పించగా, వారు అవయవదానా నికి ఒప్పుకున్నారు. దీంతో జోగారావు శరీరంలో అవయవాలను సేకరించారు. అతని గుండెను చెన్నై ఎంజీఎంకు, ఒక కిడ్నీని వైజాగ్ మెడికవర్‌కు, మరో కిడ్నీని విశాఖపట్నం కిమ్స్‌కు, ఊపిరితిత్తులు హైదరాబాద్ కిమ్స్‌కు గ్రీన్‌చానల్ ద్వారా తరలించారు. పుట్టెడు దుఃఖంలోనూ కుమారుడి అవయవదానానికి అంగీకరించిన.. జోగారావు తండ్రి మల్లేశ్వరరావును, కుటుంబ సభ్యులను అధికారులు అభినందించారు.

● ఈ ఏడాది మే 16న గార మండలం కె.మత్స్యలేశం గ్రామానికి చెందిన పుష్ప సుశీల, మే 17న శ్రీకాకుళం నగరానికి చెందిన తోట శ్రీనివాసరావు వేర్వేరు రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. వారిని కుటుంబ సభ్యులు రాగోలులోని జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి అవయవదా నానికి ఒప్పించారు. సుశీల, శ్రీనివాసరావు మృతదేహాల నుంచి మూత్రపిండం, కాలేయాన్ని సేకరించి విశాఖ తరలించారు.

● ఈ ఏడాది ఆగస్టు 17న లావేరు మండలం అదపాక గ్రామానికి చెందిన దుక్క భాస్కరరావు అనే పెయింటర్, అక్టోబరు 22న సోంపేటకు చెందిన జగదీష్ అనే యువకుడు ప్రమాదాలకు గురై బ్రెయిన్ డెడ్ అయ్యారు. అవయవదానంపై వారి తల్లిదండ్రులకు వైద్యులు అవగాహన కల్పించారు. అవయవదానం గొప్పతనాన్ని వివరించారు. దీంతోవారు అంగీకరించడంతో భాస్కరరావు, జగదీష్ మృతదేహాల నుంచి నేత్రాలు, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, కాలేయం వంటివి సేకరించి గ్రీన్ చానల్ ద్వారా విశాఖ, చెన్నైకి తరలించారు. వాటిని మరికొందరికి అమర్చారు.

● గత ఏడాది ఏప్రిల్ 13న సోంపేటలో మల్లారెడ్డి కిరణ్‌చంద్ అనే బాలుడు పదో తరగతి పరీక్షలు రాస్తూ కేంద్రంలోనే కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబసభ్యులు హుటాహుటిన రాగోలులో జెమ్స్‌కు తరలించారు. అదే నెల 16న ఆయన బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబసభ్యుల సమ్మతి మేరకు వైద్యులు బాలుడి అవయవాలను సేకరించి గ్రీన్‌చానల్ ద్వారా వేర్వేరు ఆస్పత్రులకు తరలించారు. దీంతో ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు ఆ బాలుడు.



రణస్థలం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి):

జిల్లా ప్రజలు అవయ వదానానికి ముందుకు వస్తున్నారు. కొంతమంది మరణిస్తూ.. కుటుంబ సభ్యుల అంగీకారంతో చేసిన అవయవదానం.. ఎంతోమందికి పునర్జన్మనిస్తోంది. ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. కొంతమంది ప్రమాదాల బారిన పడిన సమయాల్లో బ్రెయిన్‌డెడ్‌కు గురవుతున్నారు. అటువంటి వారి అవయవాలను కుటుంబ సభ్యుల సమ్మతితో దానం చేస్తే.. ఎంతోమందికి ప్రాణదాతగా నిలవచ్చు. ఒక వ్యక్తి అయవదానంతో ఎనిమిది మంది బతుకుల్లో వెలుగులు నింపవచ్చు. అవయవాలన్నీ సరిగ్గా ఉంటేనే అది సాధ్యపడుతుంది. బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి నుంచి కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, గుండె, కవటాలు, పేగులు, క్లోమం, కార్నియా వంటివి సేకరించి మరొకరికి అమర్చవచ్చు. జీవించి ఉన్న వ్యక్తుల నుంచి మూత్రపిండాలు, ఎముకలోని మూలుగు, కాలేయంలోని కొంత భాగం దానం చేయవచ్చు. జీవన్‌దాన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వమే గ్రీన్‌చానల్ ద్వారా అవయవాలను తరలించే ఏర్పాటు చేస్తోంది. అందుకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. దీనిపై ప్రజల్లో మరింత అవగాహన పెంచేందుకు అధికారులు, వైద్యులు కృషి చేయాల్సి ఉంది.



అవయవాలను తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

ప్రభుత్వం సహకరిస్తోంది



రాష్ట్ర వ్యాప్తంగా అవయవదానంపై అవగాహన పెరుగుతోంది. కూటమి ప్రభుత్వం దీనికి ఎంతగానో సహకరిస్తోంది. సరికొత్త మార్గదర్శకాలు సైతం జారీ చేసింది. ప్రజల్లో కూడా చైతన్యం పెరుగుతోంది. రాష్ట్రంలో 4వేల మందికి పైగా అవయవాలు అవసరం ఉంది. జిల్లాలో ఇటీవల అవయవదానానికి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ముందుకు రావడం శుభ పరిణామం

-డాక్టర్ కె.రాంబాబు, జీవన్‌దాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్

ప్రత్యేక చట్టాలు..

అవయవదానానికి సంబంధించి ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చాయి. 1994లో తొలిసారిగా మన దేశంలో అవయవ, కణాల మార్పిడి చట్టాన్ని తీసుకొచ్చారు. 2011లో దానికి సవరణలు చేశారు. అవయవాల సేకరణ, తరలింపు, కేటాయింపు వంటిని జాతీయస్థాయిలో జాతీయ అవయవ, కణజాల మార్పిడి సంస్థ (ఎన్ఓటీటీవో) పర్యవేక్షిస్తోంది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి జీవన్ దాన్, ఇండియన్ రెడ్‌క్రాస్ వంటి సంస్థలు బాధ్యతలను చూస్తున్నాయి. దశాబ్దాలుగా మెరుగైన సేవలందిస్తున్నాయి.

పెరిగిన అవగాహన కార్యక్రమాలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అవయవదాతల కుటుంబాలకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. అవయవదాత అంత్యక్రియలకు కలెక్టర్ లేదా ప్రభుత్వం తరఫున ఒక ప్రతినిధి తప్పకుండా హాజరు కావాలని ఆదేశించింది. అంత్యక్రియ ఖర్చులకు రూ.10 వేలు కూడా అందిస్తోంది. అవయవాల తరలింపునకు వీలుగా గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇప్పటికే కొన్ని మార్గాలను సైతం ఎంపిక చేసింది. జిల్లాలో అవయవదానంపై విస్తృత అవగాహన పెరగాల్సి ఉంది. మరణం తరువాత అవయవదానం చేస్తామని ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు అంతా ముందుకొస్తే ప్రజల్లో కూడా అవగాహన పెరిగే అవకాశముంది. జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ అవయవదానంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తూ ఒప్పంద పత్రాలను సేకరిస్తోంది.



'5కె వాక్'లో పాల్గొన్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు

మత్తుతో జీవితాలను నాశనం చేసుకోవద్దు

- గంజాయిని కూకటివేళ్లతో పెకలించాలి
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

7లో

మరింత 'ఉపాధి'

- కనీస వేతనం రూ.300కు పెంపు
- మస్తర్ల మాయాజాలానికి చెక్ పెట్టేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు

నరసన్నపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బోగస్ మస్తర్లకు చెక్ పెట్టి.. కూలీలకు వేతనం పెంచి.. మరింత ఉపాధి కల్పించేలా చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం వేతనదారులకు రోజుకు రూ.263 కూలి ఉండగా.. దానిని రూ.300కు పెంచేందుకు వేతన పర్యవేక్షణ విభాగాన్ని ఏర్పాటు చేసింది. పనివేళల్లో కూడా మార్పులు చేసి.. గిట్టుబాటు వేతనం అందజేయనుంది. ఆ విభాగానికి డ్వామాలో కీలకంగా ఉండే జిల్లా విజిలెన్స్ అధికారిని నియమించింది.

జిల్లాలో 4.32 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. ఈ ఏడాది 7.35 లక్షల పనులను అధికారులు గుర్తించారు. ప్రస్తుతం 3.8 లక్షల మంది వేతనదారులు పనులకు వెళ్తున్నారు. జిల్లాలో గుర్తించిన వాటిలో 6.02లక్షల పనులు సాగుతున్నాయి. వేతనదారులు ప్రస్తుతం 4 గంటలు పనిచేస్తున్నారు. అదనంగా మరో గంట పెంచేలా చూడాలని ప్రభుత్వం సూచించింది. ఉపాధిహామీ సిబ్బందితో పాటు ఏపీడీలు, ఏపీవోలు, ఎంపీడీవోలు నిత్యం మస్తర్లను తనిఖీ చేయాలి. కూలీలకు రోజుకు 300 వేతనం (మిగతా 8వ పేజీలో..)



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

కానిస్టేబుల్ అభ్యర్థులకు నేటి నుంచి దేహదారుఢ్య పరీక్షలు

7లో



దీపారాధన చేస్తున్న భక్తులు

కోటి దీపోత్సవం

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్ మైదానంలో ఆదివారం రాత్రి కోటి దీపోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. విజయదుర్గ, విజయగణపతి ఆలయాల ప్రధాన అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ, పెంటా శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. 85 గడుల్లో 350 లింగాల ఆకృతిలో ప్రమిదలు ఏర్పాటు చేశారు. ఒక్కో ప్రమిదలో 366 ఒత్తులను ఉంచగా భక్తులు దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా పసర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ.. ప్రవచనామృతం చేశారు. కోటి దీపాలు.. కోటి పుణ్యాల ఫలం అని తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, బాలబాస్కర శర్మ, ఆరవెల్లి శ్రీసీతారామ శర్మ(రాంజీ) తదితరులు పాల్గొన్నారు.



భక్తుల సందడి

వన్యప్రాణులకు రక్షణేదీ?

- విదేశాల నుంచి యథేచ్ఛగా స్మగ్లింగ్
- ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా
- అధిక ధరకు విక్రయం
- ఆట వస్తువులుగా వినియోగిస్తున్న వైనం

● ఈ ఏడాది మార్చి 7న ముగ్గురు కోల్‌కతా వాసులు రెండు మౌంటేన్ మంకీస్ (ఆఫ్రికా బ్రీడ్ కోతులు)ను వాహనంలో అసోం మీదుగా చెన్నైకు తరలిస్తుండగా ఇచ్ఛాపురం చెక్‌పోస్టు వద్ద కాశీబుగ్గ అటవీశాఖ అధికారులకు పట్టుబడ్డారు. ఈ కోతులను అంతర్జాతీయ స్మగ్లర్ల ముఠా మన దేశానికి తీసుకువచ్చి అసోంలో కోల్‌కతాకు చెందిన బ్రోకర్లకు అప్పగించినట్లు విచారణలో తేలింది. ఆ ముగ్గురినీ పోలీసులు అరెస్టు చేసి.. కోతులను విశాఖపట్నం జంతుప్రదర్శనశాలకు తరలించారు.

● గత నెల 12న కర్ణాటక రాష్ట్రానికి చెందిన ముగ్గురు అంతరాష్ట్ర దొంగలు పాములు, తాబేళ్లు, అడవిపిల్లిని స్మగ్లింగ్ చేస్తుండగా ఇచ్ఛాపురం చెక్‌పోస్టు వద్ద కాశీబుగ్గ అటవీశాఖ అధికారులకు పట్టుబడ్డారు. వారినుంచి మొత్తం 21 వన్యప్రాణులను స్వాధీనం చేసుకున్నారు. వాటిని కట్టుదిట్టమైన భద్రత మధ్య విశాఖపట్నం జంతు ప్రదర్శనశాలకు తరలించారు.

● రెండేళ్ల కిందట పలాసకు చెందిన ముగ్గురు స్మగ్లర్లు మహేంద్రగిరి కొండల్లో అరుదుగా లభించే అలుగులను అక్రమంగా రవాణా చేస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి మూడు అలుగులను స్వాధీనం చేసుకుని అడవిలో విడిచిపెట్టారు.



కాశీబుగ్గ అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న ఆఫ్రికా కోతులు, కొండచిలువ పిల్లలు, అడవిపిల్లి (ఫైల్)

పలాస, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి):

వన్యప్రాణులకు రక్షణ కరువైంది. కొందరి చేతుల్లో అవి బందీ అవుతున్నాయి. కోతులు, పాములు, తాబేళ్లు, అడవిపిల్లులు, అలుగులు తదితర వాటిని కొంతమంది ఆట వస్తువులుగా వినియోగిస్తున్నారు. వాటిని తమ దగ్గర ఉంచుకోవడాన్ని స్టేటస్ సింబల్‌గా భావిస్తున్నారు. ఇలాంటి వారి కోసం స్మగ్లర్లు కొన్ని జంతువులను విదేశాల నుంచి, మరికొన్నింటిని స్థానిక అడవుల నుంచి తెస్తున్నారు. వాటిని అక్రమ మార్గంలో రవాణా చేస్తూ లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. ఉగండా దేశంలో అరుదైన మౌంటేన్ మంకీస్(ఆఫ్రికాబ్రీడ్ కోతులు) లభ్యమవుతాయి. ఇవి మనుషులకు ఎటువంటి హాని చేయవు. వీటిని పెంపుడు జంతువులుగా ఇంట్లో పెంచుకునేందుకు అనేకమంది ఇష్టపడుతుంటారు. ఈ కారణంగా అంతర్జాతీయ స్మగ్లర్లు వాటిని మన దేశానికి తీసుకువచ్చి రూ.లక్షలకు అమ్ముతున్నారు. అలాగే, పాములు, తాబేళ్లు, అడవి పిల్లుల పిల్లలను కూడా విదేశాల నుంచి తీసుకువస్తున్నారు. వాటికి రక్షణ కల్పించి పెద్దవి చేస్తున్నారు. మన వాతావరణానికి అలవాటు పడిన తరువాత స్మగ్లర్లు అధిక ధరకు విక్రయిస్తున్నారు. అలాగే అడవి అలుగు(ఇండియన్ పాంగోలిన్)కు అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. అంతరించిపోతున్న అరుదైన జీవుల్లో అలుగు కూడా ఒకటి. మన దేశంలో అక్కడక్కడా లభించే అలుగులను జపాన్, సింగపూర్, చైనా వంటి దేశాలకు స్మగ్లర్లు తరలిస్తున్నారు. దీని లేహ్యం, మాంసంలో అరుదైన లక్షణాలు ఉండడంతో వాటిని వండుకొని తినేందుకు విదేశీయులు ఇష్టపడతారనే ప్రచారం ఉంది. అలుగు పెంకులను మందుల తయారీలో వినియోగిస్తారని సమాచారం. దీంతో వేటగాళ్లు వాటిని వేటాడుతుండడంతో కనుమరుగవుతున్నాయి.

చట్టాలను పట్టించుకోని స్మగ్లర్లు..

దేశంలో జంతువులపై క్రూరత్వ నిరోధక చట్టం-1960, వన్యప్రాణుల రక్షణ చట్టం-1972 అమలులో ఉన్నాయి. వీటి ప్రకారం జంతువులు, వన్యప్రాణులను చంపడం, పట్టుకొని వ్యాపారం చేయడం క్రూరత్వం కింద వస్తుంది. వాటిని కొట్టడం, రవాణా చేయడం, పంజరాల్లో ఉంచడం, గొలుసులతో కట్టడం, నిర్బంధంలో పెట్టడం, వినోదం కోసం ఉపయోగించడం నేరం. ధిక్కారానికి పాల్పడితే కనీసం మూడేళ్ల జైలు శిక్ష, లేదా రూ.25 వేల జరీమానా విధిస్తారు. లేదా రెండింటినీ కలిపి వేయవచ్చు. చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్, రాష్ట్ర ప్రభుత్వ అధికారి అనుమతులతోనే వాటిని రవాణా చేయాలి. సెక్షన్ 49ప్రకారం లైసెన్స్ లేకుండా వన్యప్రాణుల కొనుగోలు చేయడం నేరం. కానీ, ఈ చట్టాలను స్మగ్లర్లు పట్టించుకోవడం లేదు. యథేచ్ఛగా రవాణా చేస్తూ అక్రమార్జన చేస్తున్నారు. కఠినమైన చట్టాలను అమలు చేస్తేనే తప్ప ఈ అక్రమ రవాణాను అరికట్టలేమని అటవీశాఖ అధికారులే చెబుతున్నారు. కాగా, జిల్లాలో పట్టుబడుతున్న అడవి జంతువులకు స్థానిక అటవీశాఖ అధికారులు పూర్తి స్వేచ్ఛ కల్పిస్తున్నారు. ఇటీవల మెళియాపుట్టి, కవిటి మండలాల్లో పట్టుబడిన కింగ్‌కోబ్రా, పలాసలో పట్టుబడిన రక్తపింజరి, కొండచిలువలను సమీప అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

నిరంతర నిఘాతోనే అడ్డుకట్ట

కఠినచట్టాలు అమలు, నిరంతర నిఘా ద్వారా కలప, వన్యప్రాణుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చు. ఇచ్ఛాపురం, పలాస ప్రాంతాల్లో ఇటీవల పట్టుబడిన విదేశీ జంతువులను ప్రత్యేక భద్రత మధ్య విశాఖలోని జంతు ప్రదర్శన శాలకు తరలించాం. దొంగలపై కేసులు నమోదు చేశాం. స్థానికంగా పట్టుబడిన కొన్ని జంతువులు, సర్పాలను అడవుల్లో విడిచిపెట్టాం.

- మురళీకృష్ణ, అటవీశాఖ అధికారి, కాశీబుగ్గ

నేడు సైన్స్ ఎగ్జిబిషన్

గార, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు ఎంఈవో నక్క రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఉన్న పాఠశాలలకు చెందిన ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మూడు విభాగాల్లో ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొనేలా ఆయా పాఠశాలల హెచ్‌ఎం చూడాలన్నారు. అలాగే పాఠశాల యాజమాన్య కమిటీకి వచ్చే నెల 2న బోరవానిపేట వద్ద ఉన్న సూర్యమహల్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంఈవో తెలిపారు. ఇందులో హెచ్‌ఎం ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, యాక్టివ్ మెంబర్ ఎవరో ఒకరు ఈ శిక్షణకు హాజరయ్యేలా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు చూడాలని కోరారు.

ఓబీసీ సాధనే ధ్యేయం

గార, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఓబీసీ సాధనే లక్ష్యంగా పోరాటం సాగిస్తున్నట్టు రాష్ట్ర శిష్టకరణ సంఘం అధ్యక్షుడు పోలు మహంతి ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలం చల్లపేటలో సంఘం ఆత్మీయ కలయికలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు సహకాంతో ముందుకు సాగుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు డబ్బీరు శ్రీనివాసరావు, బలివాడ మల్లేశ్వరరావు, సదాశివుని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పునరుద్ధరించాలి

గుజరాతీపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా శాఖ ప్రతినిధులు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ వార్షిక క్యాలెండర్‌ను కేంద్ర మంత్రి చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నేతలు పలు సమస్యలను కేంద్ర మంత్రికి వివరించారు. సమావేశంలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిసిని వసంతరావు, కూన రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

బూర్జ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించిందని జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ మెంబర్, నీటి సంఘం అధ్యక్షుడు బీవీఎస్‌ఎన్ రాజు పేర్కొన్నారు. ఓవీ పేట గ్రామంలో బీటీ రహదారి పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. పనుల నాణ్యతలో రాజీపడవద్దన్నారు. లచ్చయ్యపేట నుంచి ఓవీ పేట రహదారి, ఓవీ పేట నుంచి ఉప్పినివలస రహదారులకు మరమ్మతులు పనులు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. బూర్జ వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు మాట్లాడుతూ ఈ రహదారి పనులు మూలంగా లచ్చయ్యపేట, కంట్లాం, చీడివలస, ఓవీ పేట, హనుమయ్యపేట, జంగాలపేట, ఉప్పినివలస గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. నారాయణపురం ఎడమ కాలువ నీటి సంఘం వైస్ చైర్మన్ బుడుమూరు శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ.. చంద్రబాబు అధికారంలోకి రాగానే రహదారులు బాగు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశయాలు సాధించాలి

సోంపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాల సాధనకోసం స్థానిక జైభీమ్‌సేన పనిచేస్తుండడం ఎంతో సంతోషకరమని ప్రజాకవి, సామాజికవేత్త, గాయకుడు గొడిశాల జయరాజు అన్నారు. ఆదివారం నిర్వహించిన జైభీమ్ ఆవిర్భావ దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లా ఉద్యమాలకు పెట్టింది పేరన్నారు. ఈ జిల్లాకోసం పాటలు కూడా రాశానని తెలిపారు. తన పాటలతో అలరించారు. జైభీమ్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు నగిరి మోహనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమతా సైనిక్‌దళ్ నేషనల్ జనరల్ కార్యదర్శి దిగంబర కాబ్లే, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ మర్రిపాటి హరీష్‌కుమార్, మామిడి రవిసిద్ధార్థ్ తదితరులు ఉన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కేదారిపురం గ్రామానికి చెందిన బుక్త కృష్ణమూర్తి భార్య రెండు నెలల కిందట ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఆమె నడుము, కాళ్ల పనిచేయడం లేదు. నిరుపేద కుటుంబం, వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న కేపీఎం గల్ఫ్ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం ఈ కుటుంబానికి పరామర్శించి రూ.42 వేలు సాయాన్ని అందజేశారు. దాతలు ముందుకు వచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని వారంతా కోరారు.

విలువలతో కూడిన విద్య అవసరం

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నేటి విద్యార్థుల్లో కొరవడుతున్న మానవతా విలువలు, మాతృభాష విలువలు, సంస్కృతి సంప్రదాయ విలువల పరిరక్షణ దిశగా సుపథ స్వచ్ఛంద సేవా సంస్థ కృషి చేస్తుందని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు యూవీఏఎస్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా జగద్గురు పీఠం ఆధ్వర్యంలో ఆదివారం సుపథ ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. పాఠ్యాంశాలు తెలుగులో నేర్చుకోవడమే కాకుండా, పద్య పఠనం, దేశభక్తి గేయాలు, క్విజ్, వ్యాసరచనలపై శిక్షణ ఇచ్చి వారికి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జగద్గురు పీఠం ఇన్‌చార్జి పీఎస్‌ఎస్ నారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు విలువలపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రతిభా పరీక్షలో సుమారు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలు బహుమతులు అందచేశారు.

మత్తుతో జీవితాలను నాశనం చేసుకోవద్దు

- గంజాయిని కూకటివేళ్లతో పెకలించాలి
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- నగరంలో 5కే వాక్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్, ఎమ్మెల్యే శంకర్ తదితరులు

అరసవల్లి/ గుజరాతీపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులు మత్తు పదార్థాలు బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్ద కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన మహాసంకల్ప దినోత్సవంలో భాగంగా శ్రీకాకుళం అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిక్స్, జిల్లా పోలీసు శాఖ సంయుక్తంగా నిర్వహించిన 5కే వాక్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత మత్తుకు బానిసలుగా మారి బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. గత వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్‌ను గంజాయి రాష్ట్రంగా మార్చారని, యువతను మత్తులో ముంచి వారి జీవితాలను నాశనం చేశారని విమర్శించారు. గంజాయిని కూకటివేళ్లతో పెకలించేందుకు కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులు ఎక్కువగా ఈ అలవాటుకు గురవుతున్నారని, వాటికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యులు సనపల నరసింహమూర్తి, కొంచాడ సోమేశ్వరరావు, వాకముల్లు శ్రీరామ్మూర్తి, వండాన కిరణ్‌కుమార్, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన్‌రావు, ఎంఆర్‌కే దాస్, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే ఎన్ఈఆర్

అండగా ఉంటాం.. బెదిరింపులకు లొంగొద్దు

- అధికారులకు భరోసా ఇచ్చిన ఎంపీ, ఎమ్మెల్యే
- ఎంపీడీవోకి పరామర్శ

ఎచ్చెర్ల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్వేచ్ఛాయుత వాతావరణంలో అధికారులు ప్రజలకు సేవలందించాలని, ఎవరి బెదిరింపులకు లొంగాల్సిన పనిలేదని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నా, ఇంకా వైసీపీ నేతలు అధికారంలో ఉన్నామన్నభ్రమలో ఉన్నారన్నారు. మండల స్థాయి అధికారులను బెదిరించి పనులకు అడ్డు తగలాలనుకోవడం సరికాదన్నారు. నిక్కచ్చిగా వ్యవహరించే అధికారులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఎంత స్వేచ్ఛ ఉంటుందో, అధికారులకు కూడా అంతే స్వేచ్ఛ ఉంటుందన్నారు. ఎంపీడీవోపై దుర్భాషలాడి బెదిరించడం సరికాదన్నారు. అధికారుల విధులకు ఆటంకం కలిగించి, బెదిరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులకు అవమానం జరిగితే అది ప్రభుత్వానికి జరిగినట్టేనని భావిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, జనసేన పార్టీ నేత విశ్వక్సేన్, కూటమి నాయకులు బెండు మల్లేశ్వరరావు, అన్నెపు భువనేశ్వరరావు, గాలి వెంకటరెడ్డి, సంపతిరావు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

విధి నిర్వహణలో ఉండగా అస్వస్థతకు గురైన ఎచ్చెర్ల ఎంపీడీవో హరిహరరావును ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆదివారం పరామర్శించారు. నిర్భయంగా విధులు నిర్వహించాలని, మీ వెనుక మీమంతా ఉన్నామని ఎంపీడీవోకు ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు. స్వేచ్ఛగా, నిబంధనల మేరకు విధులు నిర్వర్తించుకోవాలన్నారు. పరామర్శించినవారిలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, కూటమి నాయకులు బెండు మల్లేశ్వరరావు, ముప్పిడి సురేష్, గొర్లె లక్ష్మణరావు పాల్గొన్నారు. కాగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఈ ఘటనపై అడిగి వివరాలు తెలుసుకున్నారు.

నేటి నుంచి దేహదారుఢ్య పరీక్షలు

- ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

ఎచ్చెర్ల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో భాగంగా ఎచ్చెర్ల సాయుధ పోలీసు మైదానంలో ఈ నెల 30వ తేదీ నుంచి దేహదారుఢ్య పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. సాయుధ మైదానాన్ని ఆదివారం ఎస్పీ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అభ్యర్థుల ఛాతీ కొలత, ఎత్తుతో పాటు 1600, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ ఈవెంట్లకు సంబంధించి ట్రైల్ రన్‌ను ఎస్పీ పరిశీలించారు. ప్రిలిమినరీ పరీక్ష ఉత్తీర్ణులైన వారికి శారీరక దారుఢ్య పరీక్షలను నిర్వహించనున్నట్టు చెప్పారు. మైదానంలోకి అభ్యర్థులు ప్రవేశించే ద్వారం మొదలు.. ధ్రువపత్రాల పరిశీలన, కంప్యూటరీకరణ, ఈవెంట్స్, దేహదారుఢ్య పరీక్షలు ముగించుకుని వెళ్లే ద్వారం వరకు చేపట్టాల్సిన ప్రక్రియకు సంబంధించి సూచిక బోర్డులు, ప్రతి ఈవెంట్ ట్రైల్ రన్‌ను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. ఈ దారుఢ్య పరీక్షలకు జిల్లాలో 7,390 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారన్నారు. ప్రతి ఈవెంట్ సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే జరుగుతాయన్నారు. అలాగే డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణకు నియమించినట్టు చెప్పారు. ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు ఎం.అప్పారావు, రాంబాబు, ఎల్.శేషాద్రి, నాగేశ్వరరెడ్డి, ఏవో గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఆత్మీయ కలయిక.. ఐక్యతకు చిహ్నం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు

ఎచ్చెర్ల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆత్మీయ కలయిక.. ఐక్యతకు చిహ్నం అని టీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. ఎచ్చెర్లలో ఆదివారం తూర్పు కాపు సామాజిక వర్గం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ కలయికలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా కుల సంఘాలు పనిచేస్తే హక్కుల సాధన సాధ్యపడుతుందన్నారు. శాసనమండలి ఫ్లోర్ లీడర్ బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యా ఉపాధి కల్పనకు సామాజిక వర్గంలో ఉన్న పారిశ్రామికవేత్తలు, వివిధ పక్షాల నేతలు శ్రద్ధ తీసుకోవాలన్నారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పక్షాలు సామాజిక సమీకరణాలు పరిశీలిస్తాయని చెప్పారు. శ్రీకాకుళంలో నిర్మిస్తున్న సామాజిక భవన నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. పల్సస్ సీఈవో, పారిశ్రామిక వేత్త గేదెల శ్రీనుబాబు మాట్లాడుతూ శ్రీకాకుళంలో సామాజిక భవన నిర్మాణానికి రూ.1.67 కోట్లు విరాళం అందిస్తానని, ఇంతవరకు రూ.50 లక్షలు ఇచ్చానన్నారు. మాజీ ఎమ్మెల్యేలు మీసాల నీలకంఠంనాయుడు, గొర్లె కిరణ్‌కుమార్, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని, డైరెక్టర్లు పిసిని చంద్రమోహన్, గండి రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

గార, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఆర్.జనార్దనరావు అన్నారు. ఆదివారం సాయంత్రం శిలగాం గ్రామంలో నిర్వహించిన మహాసంకల్పం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మోటారు వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ షాపింగ్ మాల్ సందర్శన



కేంద్రమంత్రిని సత్కరిస్తున్న షాపింగ్ మాల్ అధినేత వెంకటరమణ

అరసవల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు నగరంలోని సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను ఆదివారం సాయంత్రం సందర్శించారు. మాల్‌లోని అన్ని విభాగాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా షాపింగ్ మాల్ అధినేత మావూరి వెంకటరమణ కేంద్రమంత్రిని సత్కరించారు.

సౌత్‌జోన్ క్రీడా పోటీల్లో ప్రతిభ



మెడల్‌తో స్వామినాయుడు

బూర్జ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): డొంకలపర్త గ్రామానికి చెందిన బలగ స్వామి నాయుడు సౌత్‌జోన్ క్రీడల్లో ప్రతిభ కనబరిచాడు. విజయవాడలో జరుగుతున్న జాతీయ సౌత్‌జోన్ క్రీడా పోటీల్లో బటర్‌ఫ్లై విభాగంలో మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్‌ను కైవసం చేసుకున్నాడు. స్వామినాయుడు తండ్రి బలగ గణేష్ ఏలూరులో స్విమ్మింగ్ కోచ్‌గా పనిచేస్తున్నారు. తల్లి వనజాక్షి గృహిణి.

అంతర్జాతీయ నృత్యోత్సవాల్లో ప్రదర్శన

ఆమదాలవలస, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లాలోని కూచిపూడి గ్రామంలో డిసెంబరు 27, 28, 29వ తేదీల్లో నిర్వహించిన కూచిపూడి స్వర్ణపతాక నృత్యోత్సవాల్లో ఆమదాలవలసకు చెందిన షిర్డీసాయి నృత్యనికేతన్ గురువు రామకౌండిన్య శిష్య బృందం నృత్య ప్రదర్శన చేసే అవకాశం దక్కించుకున్నారు. రామకౌండిన్య శిష్యులు రోహిత మోక్షిత, తనిష్క, హర్షిణి, పూర్వి రాధా గోపాలం, వందే భవానీ అనే అంశాలను ప్రదర్శించి ఆహుతుల మన్ననలు పొందారు. మంత్రులు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు



శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక నానుబాలవీధిలో గల జిల్లా స్థాయి చదరంగం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలకు సుమారు 20 మంది ఇంటర్నేషనల్ రేటెడ్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఐదు రౌండ్ల పాటు క్లాసికల్ చెస్ పోటీలు ఉత్కంఠభరింతగా సాగాయి. ఈ సందర్భంగా చెస్ ఫెడరేషన్ సీఐఎస్ కమిటీ సభ్యులు సనపల భీమారావు మాట్లాడుతూ.. జిల్లాలో క్రీడాకారులకు కొదవలేదని, కాకపోతే ఆర్థిక సహకారం అందిస్తే రాష్ట్రానికి మంచి క్రీడాకారులు తయారు అవుతారన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చెస్ సంఘం సభ్యులు వసంతరావు, సీనియర్ క్రీడాకారులు అప్పాజీ పాల్గొన్నారు.

గ్రామసభలతోనే అభివృద్ధి సాధ్యం

గుజరాతీపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామసభలతోనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి జె.శ్రీనివాసరావు అన్నారు. సింగుపురం శాఖ గ్రంథాలయంలో ఆదివారం ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. రాజ్యాంగం సూచించిన గ్రామసభలో నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామసభల ఆవశ్యకత, ప్రజల భాగస్వామ్యంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని సూచించారు. ఐక్యవేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరమణ, కె.రాజేష్, ఎస్.రాజారావు, ఎన్.లక్ష్మణరావు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు వద్దు

కంచిలి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): న్యూ ఇయర్ వేడుకలు బహిరంగ ప్రదేశాల్లో, రహదారులపై చేపట్టొద్దని సీఐ మంగరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు పడపడం, వాహనాలతో విన్యాసాలు చేయడం, డీజే సౌండ్స్ వంటివి ఏర్పాటు చేయద్దని, చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆదిత్యాలయంలో మహాలింగార్చన



అరసవల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయ అనివెట్టి మండపంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో శివ పంచాయతన సహిత మహాలింగార్చన నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు ఘనంగా చేపట్టారు. కార్యక్రమంలో ఇప్పిలి సాందీపశర్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.3.03 లక్షలు ఆదాయం

స్వామివారికి ఆదివారం ఒక్కరోజు రూ.3,03,027 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.59,200, విరాళాల ద్వారా రూ.99,852, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.1,43,875 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వై.భద్రాజీ తెలిపారు.

సూర్యనారాయణ స్వామి దర్శనానికి పాదయాత్రగా..



వెంకటాపురం నుంచి పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

ఎచ్చెర్ల/లావేరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగర సంకీర్తన దీక్షను ముగించుకుని కాలినడకన అరసవల్లి సూర్యనారాయణస్వామి వారి దర్శనానికి ఆదివారం వెళ్తున్న లావేరు మండలానికి చెందిన భక్తులకు ఎచ్చెర్లలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సంఘీభావం తెలిపారు. లావేరు మండలం వెంకటాపురం, ఎల్ఎన్ పురం, కొత్తకుంకాం, పాతకుంకాం గ్రామాలకు చెందిన భక్తులతో కలిసి కొద్ది దూరం నడిచి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద స్వామి, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, కూటమి నేతలు నేత విశ్వక్సేన్, సంపతిరావు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత చాటి.. లక్ష్యాన్ని సాధించండి

గుజరాతీపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఐక్యతతో లక్ష్యాన్ని సాధించుకోవచ్చని ట్రేడ్ యూనియర్ జేఏసీ నాయకులు, ఎండీయూ ఆపరేటర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు టి.తిరుపతిరావు అన్నారు. ఎండీయూ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర గౌరవధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ అధ్యక్షతన స్థానిక ఎన్జీవో హోంలో ఆదివారం జరిగిన ఎండీయూ ఆపరేటర్ల జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడారు. కార్మిక సంఘంగా ఎండీయూ ఆపరేటర్ల సంఘం రూపొందించడం అభినందనీయమన్నారు. గత నాలుగేళ్లుగా ఎన్నో పోరాటాలు సాగించి ఫలితాలు సాధించిందని, అదే స్ఫూర్తితో ముందుకు సాగేందుకు తమ సహకారం ఉంటుందన్నారు. జిల్లా అధ్యక్షుడు రైతు సూర్యనారాయణ, అసోసియేషన్ ఉపాధ్యక్షులు జి.హేమంత్‌తోపాటు కె.నవీన్, డి.గోపి, కొంక్యాన వేణుగోపాల్, ఎ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'సక్షం' నూతన కార్యవర్గం

అరసవల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సక్షం (జాతీయ దివ్యాంగుల సేవా సంస్థ) నూతన కార్యవర్గం ఏర్పాటు నగరంలోని భారత్ స్పోర్ట్స్ షాప్ ప్రాంగణంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్‌గా ఎంకే మిశ్రో, అధ్యక్షుడిగా బి.రామకోటేశ్వరరావు, సహాధ్యక్షుడిగా ఎం.భాస్కరరావు, కార్యదర్శిగా సీహెచ్ గణపతి, కోశాధికారిగా ఆర్.శంకరరావు, ఉపాధ్యక్షుడిగా వై.అప్పలనాయుడు, మహిళా కార్యదర్శులుగా ఎ.రమ, ఎం.జ్యోతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.శ్రీనివాసు, జాయింట్ సెక్రటరీలు బి.ప్రసాద్, ఎ.అప్పలనాయుడు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

యువ కవులకు శిక్షణ

ఆమదాలవలస, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు మహాసభలలో యువ కవులకు రచయిత, కవి కుప్పిలి వెంకట రాజారావు శిక్షణను అందించారు. విజయవాడలో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆదివారం యువ కవులకు వచన కవిత్వం ఎలా రాయాలన్న అంశంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాజారావును మహాసభల నిర్వాహకులు సన్మానించారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శికి సత్కారం

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరుగుతున్న ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో రెండో రోజు ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, కవి బుర్రి కుమార్‌రాజు కవితాగానం చేశారు. ఈ సందర్భంగా సభా నిర్వాహకులు మెమోంటో, ప్రశంసా పత్రం అందచేసి సత్కరించారు. ఉత్తరాంధ్ర శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షులు ఈవేమన, జంధ్యాల శరత్ బాబు, దుర్గా ప్రసాద్, తదితరులు అభినందించారు.

రాజారావుకు ఘన సన్మానం

పొందూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన రచయిత, శ్రీశ్రీ కళావేదిక జిల్లా విభాగం ప్రధానకార్యదర్శి వావిలపల్లి రాజారావును విజయవాడలో కేబీఎన్ కళాశాలలో జరుగుతున్న ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో ఘనంగా సన్మానించారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం ఆహ్వానం మేరకు ఈ సభకు రాజారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా తాను రచించిన పలు పుస్తకాలను ఆహ్వానితులకు అందించారు. సినీగేయ రచయిత భువనచంద్ర, లెనిన్ శ్రీనివాస్ తదితరులు రాజారావును ఘనంగా సన్మానించారు.

అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 29(ఆంధ్ర జ్యోతి): శ్రీకాకుళం మ్యూజిక్, డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నెలావారీ సంగీత కార్యక్రమం స్థానిక బాపూజీ కళామందిర్‌లో నిర్వహించారు. మృదంగ విద్వాంసులు మావుడూరు సూర్యప్రసాద్ ఆధ్వర్యంలో మృదంగ లయ విన్యాసం ఆకట్టుకుంది. మావుడూరు సూర్యప్రసాదరావు, మండా శ్రీనివాసరావు, గాన భక్తుల రవికుమార్, చలపరాయి చాణిక్య మావూడూరు శ్రీనివాసరావు, చలపరాయి వినోద్, బ్రహ్మాజీ, వాయునందన శర్మ మృదంగాన్ని వాయించారు. మావుడూరు సత్యనారాయణ వయొలిన్ ప్రదర్శించారు. అభినయ నృత్యనికేతన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు నీరజా సుబ్రహ్మణ్యం శిష్య బృందంచే కూచిపూడి, భరతనాట్యం, నృత్య ప్రదర్శన అలరించాయి. అనంతరం నీరజా సుబ్రహ్మణ్యం బృందానికి సత్కరించారు. ఈ సందర్భంగా మార్దాంగిక విద్వాంసులు దివంగత వరద కమలాకర్‌రావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.



నృత్య ప్రదర్శనలో నీరజా సుబ్రహ్మణ్యం బృందం

క్రైం కార్నర్

బైక్ అదుపు తప్పి.. విద్యుత్ స్తంభాన్ని ఢీకొని

● ఒకరి మృతి, ● మరొకరికి తీవ్ర గాయాలు

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనకాపల్లి సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదం లో ఒక యువకుడు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు, ఎస్‌ఐ నిహార్ తెలిపిన వివ రాలిలా ఉన్నాయి. పలాస పట్టణం లేబర్ కాలనీకి చెందిన మురుపల్లి శివ(26) మిత్రుడు పలాసకు చెందిన శంకు షణ్ముఖరావుతో కలిసి అనకాపల్లి వైపు వస్తున్న సమయంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. దీంతో వాహనం పల్టీ కొట్టడంతో శివ అక్కడికక్కడే మృతి చెందాడు. షణ్ముఖరావుకు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. అయితే వీరు అనకాపల్లి ప్రాంతానికి ఎందుకు వెళ్లారనే విషయమై విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

గతంలోనూ ఈ ప్రాంతంలోనే..

ఆదివారం ప్రమాదం జరిగిన ప్రాంతంలోనే నెలరోజుల కిందట యశ్వంత్ అనే యువకుడు ద్విచక్రవాహనం పల్టీకొట్టి మృతిచెందాడు. అలాగే రెండు నెలల కిందట ఇద్దరు యువకులు అనకాపల్లికి చెందిన యువతిని ఢీకొట్టడంతో ఆమె తీవ్రగాయాలతో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదాలకు అతివేగమే కారణమని స్థానికులు చెబుతున్నారు. హెల్మెట్ ధరించక పోవడం, వాహనం వేగం నియంత్రణ లేకపోవడం, ప్రమాదాలపై పోలీసు అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో తరచూ ఇలాంటివి సంభవిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

తమ్మినాయుడు పేట వద్ద..

ఎచ్చెర్ల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడుపేటకు సమీపంలో సనపలవానిపేటకు ఎదురుగా జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి మండలం మామిడిపాలెం గ్రామానికి చెందిన చిన్ని కృష్ణ(39) సీ ఫుడ్స్‌తో ఉన్న వ్యాన్ డ్రైవ్ చేసుకుంటూ ఒడిశా వెళ్తుండగా.. సనపలవానిపేట వద్ద ఆగిన ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో కృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. కృష్ణ భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లావేరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాయినింగారిపేటకు చెందిన జగ్గురోతు సత్యనారాయణ (30) మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సత్యనారాయణ తన వ్యక్తిగత కారణాల వల్ల కొద్ది రోజులుగా మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో ఇంటి వద్ద ఉన్న గడ్డి మందును శనివారం ఉదయం తాగాడు. ఇలా అపస్మారక స్థితిలో ఉన్న అతడిని 108 వాహనంలో చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. అతడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం ఏఎస్‌ఐ జగన్మోహన్‌రావు కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

ఎచ్చెర్ల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): తోటపాలెం ఎస్‌ఏటీ నగర్‌లో నివాసం ఉంటున్న ఓ ఉపాధ్యాయుని ఇంట్లో శనివారం చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తలచింతల శేఖర్, అతని భార్య ఉపాధ్యాయులు. శనివారం ఉదయం విధులకు వెళ్లిపోయారు. తిరిగి సాయం త్రం ఇంటికి వచ్చి తలుపులు తెరిచి చూసేసరికి ఇంటి వెనుక నుంచి దొంగలు ప్రవేశించారు. బీరువాలోని ఆరున్నర తులాల బంగారం, రూ.50 వేలు నగదు అపహరించుకుపోయారు. ఆదివారం శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

రణస్థలం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఫోర్స్ మెంట్ సిబ్బంది శనివారం చేపట్టిన దాడుల్లో 35 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ అనురాధ తెలిపారు. ఆదివారం ఆమె తెలిపిన వివరాల మేరకు.. లావేరు మండలం కొత్తకుంకాం గ్రామానికి చెందిన ఎల్.భవాని ఇంట్లో తనిఖీ చేయగా మద్యం సీసాలు పట్టుబడ్డాయన్నారు. దీంతో ఆమెను రణస్థలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పజెప్పారు. కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

నెలలో 17 కేసుల నమోదు

ఇచ్ఛాపురం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఈ నెలలో చేపట్టిన దాడుల్లో 17 కేసులు నమోదు చేసి 17మందిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.దుర్గా ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒడిశా మద్యం సీసాలు 71, డ్యూటీ పెయిడ్ లిక్కర్ 82 సీసాలు, 37 లీటర్ల సారా, 18.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సారా కేసులో ఇక ద్విచక్ర వాహనం, గంజాయి కేసులో ఒక ద్విచక్ర వాహనం సీజ్ చేశామన్నారు. పాత కేసుల్లో పట్టుబడినవారిని ఇచ్ఛాపురం, మందస మండలాల తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేసినట్టు తెలిపారు. సారా, గంజాయి, ఒడిశా మద్యం ఎవరైనా తరలిస్తే 86399 59250, 94408 30385 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పేకాట ఆడుతున్న ముగ్గురిపై కేసు

కొత్తూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ ఎండీఅమీర్ ఆలీ తెలిపారు. మండల కేంద్రంలోని రెల్లివీధిలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను ఆదివారం అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.1020 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

సముద్రంలో మునిగిన బోటు


బోటును ఒడ్డుకు చేరుస్తున్న మత్స్యకారులు

ఇచ్ఛాపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): డొంకూరు గ్రామ సముద్రతీరంలో లంగర్ వేసిన బోటు అలల తాకిడికి మునిగి ధ్వంసమైంది. వివరాలి లా ఉన్నాయి.. డొంకూరు గ్రామానికి చెందిన బడే చిన్నా రావుతోపాటు మరి కొందరు మత్స్యకారులు కలిసి సముద్రం లో వేట సాగిం చేందుకు శనివారం సాయంత్రం సముద్రంలోకి వెళ్లారు. వేట ముగించుకొని ఆది వారం వేకువజామున తీరానికి చేరుకున్నారు. తీరానికి సమీపాన సముద్రంలో బోటుకు లంగరు వేసి ఇళ్లకు వచ్చే శారు. ఇంతలోనే రాకాసి అలల తాకిడికి లంగరు వేసిన బోటు మునిగి ధ్వంస మైంది. ఈ ఘటనలో రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని మత్స్యకారులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం ఆదు కోవాలని తోటి మత్స్యకారులు కోరుతున్నారు.

రెండోరోజూ కొనసాగిన 'హ్యాక్‌థాన్'

టెక్కలి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ప్రారంభమైన హ్యాక్‌థాన్ ఆవిష్కార్ జాతీయ సదస్సు ఆదివారం కూడా కొనసాగింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొని పలు సమస్యలకు వారి పరిష్కారాలను ఈ వేదికలో ప్రదర్శించారు. దేశంలోని 51 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 186 మంది విద్యార్థులు పాల్గొని తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

టెక్కలి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి పాలకులు చొరవ చూపాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రామ్మోహన్ అన్నారు. ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా 43 మహాసభల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షురాలిగా టి.పవిత్ర, కార్యదర్శిగా డి.చందు, ఉపాధ్యక్షులుగా దుర్గారావు, సీహెచ్.రాజు, సహాయకార్యదర్శిగా సంతోష్‌కుమార్, ఖగేష్‌లను ఎన్నుకున్నారు.

పూలబొకేలు, శాలువాలు తేవద్దు: మంత్రి అచ్చెన్న



టెక్కలి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా నిమ్మాడ వచ్చే పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పూలబొకేలు, దండలు, గజమాలలు, కేక్‌లు తీసుకు రావద్దని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వాటికి బదులు పేద విద్యార్థులకు ఉపయోగ పడేలా పుస్తకాలు, పెన్నులు అందించాలని సూచించారు.

ఆడంబరాలు వద్దు: శిరీష



పలాస, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం వేడుకల్లో అభిమానులు, కార్యకర్తలు, నాయకులు ఎటువంటి ఆడంబరాలకు వెళ్లకుండా నిర్వహించుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పూలు, బొకేలు, మిఠాయిలు తీసుకురావద్దని, పెన్ను, పుస్తకాల ఇస్తే సరిపోతుందని, వాటిని నిరుపేదలకు అందించేందుకు శ్రీకారం చుడదామన్నారు.

ఇంటి వద్దే వేడుకలు జరుపుకోండి

● డీఎస్పీ వెంకట అప్పారావు



పలాస, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): న్యూ ఇయర్ వేడుకలు ప్రతి ఒక్కరు తమ ఇళ్ల వద్దే ఆనం దంగా చేసుకోవాలని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు కోరారు. ఈ మేరకు ఆదివారం విలే కరులతో మాట్లాడుతూ.. రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు జరపడం వల్ల ఇతరులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉంటుందన్నారు. బాణసంచా కాల్చడం, ట్రిబుల్ రైడింగ్ చేయవద్దని, హోటల్స్, ప్రత్యేక కార్యక్రమాలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. ఈ వేడుకల్లో ఎవరికి ఇబ్బంది కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అన్ని ముఖ్య ప్రాంతాల్లో నిఘా ఉంటుందన్నారు.

గూడెం వీవోఏ చేతివాటం?

● ఎస్‌హెచ్‌జీ సంఘాల సొమ్ము స్వాహా
● బ్యాంకులో జమ చేసినట్లు ఫేక్ రసీదులు అందజేత



బ్యాంక్‌లో జమ చేసినట్లు చూపించిన ఫేక్ రసీదులు

టెక్కలి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్వయంశక్తి సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు) బ్యాంకులో జమ చేయాలని అందించిన నగదును స్వాహా చేసి, బ్యాంకు పేరిట ఫేక్ రసీదులను సృష్టించి ఆయా సంఘాలకు ఇచ్చిన ఘటన కలకలం రేపింది. వివరాలిలా ఉన్నాయి.. గూడెం గ్రామానికి చెందిన గాంధీజీ, వివేకానంద, భూలోకమాత స్వయంశక్తి సంఘాల సభ్యులు బ్యాంకులో వాడుకున్న నగదుకు, అలాగే నెల వారీ పొదుపు మొత్తం రూ.41,500 లను జమచేయాలని గ్రామానికి చెందిన వీవోఏ సార గంగయ్యకు అందజేశారు. అయితే ఆ నగదును టెక్కలి యూనియన్ బ్యాంకులో జమ చేసి నట్లు ఫేక్ రసీదులు సృష్టించి సదరు సంఘ ప్రతినిధులకు అందజేశాడు. నెలవారీగా క్రమం తప్పకుండా చెల్లించే సంఘాలు ఈసారి కట్టకపోవడంపై సంబంధిత బ్యాంకు మేనేజర్ ఆరా తీయడంతో అసలు విషయం బయటపడింది. దీంతో వెలుగు శాఖ ఒక్క సారిగా ఉలికి పడింది. అయితే వరుసగా రెండు రోజులు బ్యాంకుకు సెలవులు కావడంతో వెలుగుశాఖ అధి కారులు జాప్యం చేశారు. సంబంధిత వీవోఏ అందించిన రూ.24 వేలు, రూ.15వేలు, రూ.1000, రూ.1,500 ఫేక్ రసీదులు పట్టుకుని ఆయా స్వయంశక్తి సంఘాల ప్రతినిధులు వెలుగుశాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. గంగయ్య ఫేక్ రసీదుల వ్యవహారమై వెలుగు అధికారులు విచారణకు ఆదేశించారు. విచారణకు గాను ఏపీఎం ఉమారాణి, సీసీ లీలావతి, సీఆర్‌సీ సభ్యులను నియమించినట్లు ఆ శాఖ ఏసీ శ్రీరాములు తెలిపారు. గంగయ్య అక్రమాలకు పాల్పడినట్లు తేలితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. స్వయంశక్తి సంఘాల మహిళలు వారే స్వయంగా బ్యాంకులకు వెళ్లి నగదు చెల్లించుకోవాలని ఆయన సూచించారు.

ఎమ్మెల్యేను కలిసిన డీవీఎంసీ సభ్యులు


ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి పుష్పగుచ్ఛం అందిస్తున్న డీవీఎంసీ సభ్యులు యోగి, అప్పన్న

నరసన్నపేట/జలుమూరు, (సారవకోట), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా విజిలెన్స్ మోనట రింగ్ సభ్యులుగా ఇటీవల నియమితులైన కళింగపట్నం అప్పన్న, వాబ యోగి ఆదివారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని మర్యాద పూర్వకంగా కలిశారు. కత్తెరవానిపేటలోని క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేస్తామని, ఎస్సీ, ఎస్టీ హక్కులకు భంగం కలుగకుండా పర్యవేక్షిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సారవకోట టీడీపీ మండల నాయకులు చల్ల ఆనంద్, ఇప్పిలి ఆంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభలో 'తెప్పల'

పలాసరూరల్,డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): విజయవాడలో శని, ఆదివారాల్లో జరిగిన 6వ ప్రపం చ తెలుగు రచయితల మహాసభల్లో పలాసకు చెందిన రచయిత, నటుడు, జనజాగృతి వ్యవ స్థాపక అధ్యక్షుడు తెప్పల కృష్ణమూర్తి పాల్గొని కవితా గానం చేశారు. 'తరతరాల తెలుగు యుగ యుగాల వెలుగు' అనే అంశంపై కవితను ఆలపించి ఆహూతుల ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను సినీగీత రచయిత రసరాజు, లెనిన్ శ్రీనివాస్, సాహితీవేత్త కె.దాలినాయుడు తదితరులు సత్కరించారు.

ఘనంగా సూర్య భగవానుడికి పూజలు

పలాసరూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): తర్లాకోట, బ్రాహ్మణతర్లా, రెంటికోట, పండాశాసనం గ్రామాల్లో ఒడియా బ్రాహ్మణ మహిళలు పుష్యమాసం ఆదివారం సందర్భంగా సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల పండ్లు, పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. ఉత్తరాయణంలోకి సూర్యుడి ప్రవేశించే పుష్యమాసంలో సూర్యుడ్ని పూజించడం ద్వారా ఆరోగ్యం సిద్ధి స్తుందని నమ్మకం. మహిళలు వాయినాలను అందజేశారు.

అభాగ్యులకు లయన్స్ చేయూత



హరిపురం, డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి): హరిపురం, బాలిగాం, మందస రోడ్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో బిచ్చగాళ్లు, అభాగ్యులకు కోస్టల్ లయన్స్ క్లబ్ చేయూత నందించింది. సుమారు 120 మందికి ఆదివారం దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. సీతాకాలం చలితో తీవ్ర ఇబ్బందులు పడుతున్న దుస్థితిని చూసి లయన్స్ అధ్యక్షుడు బైరిశెట్టి గున్నయ్య, సభ్యులు వీరికి దుప్పట్లతో పాటు ఒక జత దుస్తులు అందించారు. కార్యక్రమంలో వైఎస్‌ఎన్ మూర్తి, పుల్లా వాసు, బావన దుర్యోధన, ఎం.లక్ష్మణరావు, మార్పు వెంకటేశం, జన్ని రాము తదితరులు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగుల సమావేశం

టెక్కలి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల జాతీయవేదిక ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.వేణుగోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు సమావేశం జరుగుతుందని, దివ్యాంగ సమస్యలతో పాటు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు పాపం జగన్‌దే: ఎంజీఆర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు పెంచిన పాపం మాజీ సీఎం జగన్ రెడ్డిదేనని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక సీది కూడలిలో ఆదివారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో విద్యుత్ చార్జీలు పెంచి ఇప్పుడు వారే ధర్నాలు చేయడం ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాలు నేటి కూటమి ప్రభుత్వానికి ఆపాదించడం దెయ్యాలు వేదాలు వల్లిం చడమేనన్నారు. వైసీపీ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా విద్యుత్ కొనుగోలు చేసి ఆ భారాన్ని ప్రజలపై వేయా లని అప్పటి సీఎం జగన్ ఈఆర్సీని కోరారని ఆయన గుర్తు చేశారు. 2022-23, 2023-24 సంవత్సరాలకు ప్రజలపై భారం వేయాలని జగన్ ప్రభుత్వం ఆమో దం తెలిపి ఈఆ ర్సీకి పంపిందని, అంటే రెండేళ్ల కిందటే ఈ భారం వేయాల్సి ఉందన్నారు. ఇప్పుడు విద్యుత్‌చార్జీల పెంపుపై ధర్నాలు చేపట్టడం హాస్యా స్పదంగా ఉంద న్నారు. కార్యక్రమంలో పాలకొండ టీడీపీ ఇన్ చార్జి పడాల భూదేవి, నేతలు సలాన మోహన రావు, తులసీ వర ప్రసాద్, పైల బాబీ, సైలాడ సతీష్ పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ మహాసభలకు రండి

● కేంద్రమంత్రిని కోరిన యూటీఎఫ్ నేతలు


మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

కోటబొమ్మాళి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలకు హాజరు కావాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఆ సంఘ నేతలు కోరారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాకుళంలోని ఎంపీ కార్యాలయంలో ఆయనను యూటీఎఫ్ నాయకులు బమ్మిడి శ్రీరామమూర్తి, బి.రవికుమార్, జి.నారా యణరావు రామ్మోహన్ నాయుడును కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా మహా సభల పోస్టర్‌ను కేంద్ర మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహాసభలకు హాజరవుతానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, యూటీఎఫ్ ప్రతినిధులు కె.సురేష్, డి.గణపతి, ఎం.మన్మథరావు, పి.సింహాచలం, ఎల్.కోందండరామయ్య, పాపారావు తదిత రులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూమిలోని మొక్కల తొలగింపు


ప్రభుత్వ భూమిలో మొక్కలను తొలగిస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలో అక్రమార్కులు ప్రభుత్వ భూమి ని ఆక్రమించి కొబ్బరి మొక్కలు వేయడంతో వాటిని ఆదివారం తొలగించినట్లు తహసీల్దార్ రమేష్ కుమార్ తెలిపారు. గ్రామ పరిధిలో సర్వే నెంబర్ 315లో 0.82 సెంట్లు ప్రభుత్వ భూమిని ఆక్ర మించి కొబ్బరిచెట్లు నాటారని గ్రామస్థులు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ ఆదే శాల మేరకు ఎక్స్‌కవేటర్ సాయంతో కొబ్బరి మొక్కలు తొలగించామన్నారు. 80 ఏళ్లుగా మా ఆధీ నంలో ఉన్న భూమిలో కొబ్బరి మొక్కలు వేసుకున్నామని, రాజకీయ కక్షతో వాటిని తొలగించడం సరికాదని జోగు రాములమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యాన పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి

టెక్కలి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మామిడి, కొబ్బరి పంటలకు ప్రభుత్వం కల్పించిన పంటల బీమా సదుపాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి ఉద్యానవనశాఖ ఏడీ కె.శైలజ కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 31లోగా మామిడికి ఎకరాకు రూ.1,850 ప్రీమియం చెల్లించి వాతావరణ ఆధారిత బీమా కింద కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దెబ్బతింటే ఎకరాకు రూ.36 వేలు బీమా వర్తిస్తుందని, దీని కాలపరిమితి డిసెంబరు 15 నుంచి మే 31 వరకు వర్తిస్తుందని, ఈ మధ్యకాలంలో అధిక వర్షాలు, గాలిలో తేమశాతం తదితర కారణాలతో నష్టం వాటిల్లితే ప్రభుత్వ నిబంధనల మేరకు నష్టం అంచనా వేసి బీమా మొత్తం అందిస్తారన్నారు. అలాగే కొబ్బరికి నాలుగు నుంచి 15 ఏళ్ల లోపు మొక్కలకు సంబంధించి ఒక్కో మొక్కకు రూ.2.25, 16 నుంచి 60 ఏళ్ల లోపు మొక్కకు రూ.3.50 చెల్లిస్తే ప్రకృతి వైపరీత్యాలతో నష్టం వాటిల్లితే బీమా కింద రూ.900, రూ.1,550 చొప్పున అందించడం జరుగుతుందన్నారు. రైతు సేవా కేంద్రాలను, ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

టెక్కలి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): టెక్కలి పీఏసీఎస్ సభ్యులు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని పర్సన్ ఇన్ చార్జి కె.రవికిషోర్, సీఈవో బీఎస్‌ఎన్ రాజులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి రాయితీలు పొందాలంటే సంఘ పరిధిలోని రుణదాతలు, సభ్యులు ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు.

రబీ వరి సాగుకు రైతులు సన్నద్ధం

నందిగాం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో రబీ కింద వరి సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. నందిగాం, పెంటూరు, పెద్దతామరాపల్లి, గొల్లూరు, నర్సిపురం, దిమిలాడ, పెంటూరు, నరేంద్రపురం తదితర గ్రామాల్లో రైతులు ఒక పక్క నారుమడులు సిద్ధం చేయడమే కాకుండా ఎద కింద సాగు చేసేందుకు దమ్ము మడులను సిద్ధం చేశారు. వ్యవసాయశాఖ కూడా రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ అందుబాటులో ఉంచింది. దీంతో పొలం పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు.

బీచ్‌లకు పర్యాటకుల తాకిడి

వజ్రపుకొత్తూరు/పోలాకి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండలం శివసాగర్, పోలాకి మండలం రాజారాంపురం బీచ్‌లలో పర్యాటకులు సందడి చేశారు. ఈ ఏడాది చివరి ఆది వారం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. ఉదయం నుంచి సమీపంలోని తోటల్లో సహపంక్తి భోజనాలు, ఆట పాటలతో సందడి చేసి సాయం సమయంలో బీచ్‌లో సేదతీరారు. సముద్ర స్నానాలు చేసి ఆనందం పొందారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐలు నిహార్, రంజిత్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే తోటూరు, వజ్రపుకొత్తూరు, డోకులపాడు, కొత్తపేట, దేవునల్తాడ సముద్ర తీరాల్లోనూ పర్యాటకుల తాకిడి కనిపించింది.



వజ్రపుకొత్తూరు: శివసాగర్, పోలాకి: రాజారాంపురం తీరాల్లో పర్యాటకులు

న్యూస్ బాక్స్

5న ద్విగళ అష్టావధానం

నరసన్నపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉర్లాం గ్రామంలో జనవరి 5న ద్విగళ అష్టావధానం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బంకుపల్లి శ్రీదివాకర్‌శర్మ, సింహాచలశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అవధానులు డా.బలుసు అపర్ణ, సునరావు చంద్రశేఖర్‌శర్మ, రంప సాయికుమార్ శర్మ తదితరులు ఈ ప్రక్రియను చేపడతారని, సాహిత్యాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు కొండల ప్రాంతంలో మంత్రి పర్యటన

నందిగాం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండల ప్రాంతంలో రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం పర్యటించనున్నట్లు టీడీపీ నాయకులు పి.అజయ్‌కుమార్, పోలాకి చంద్రశేఖరరావు, ఎం.బాలకృష్ణ తెలిపారు. ఆరోజు ఉదయం పెద్దతామ రాపల్లి నుంచి దీనబంధుపురం వరకు పర్యటించి గ్రామాల్లోని సమస్యలను తెలుసుకోవడంతోపాటు రోడ్లు, ఇతర అంశాలపై పర్యవేక్షిస్తారన్నారు. టీడీపీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

పాతపట్నం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాసిగంగుపేట గ్రామంలో సమీప బంధువు బండి ఎరకమ్మ ఇటీవల మృతి చెందగా ఆదివారం కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. వయోభారంతో మృతి చెందిన ఎరకమ్మ కుటుంబ సభ్యులు బండి రవివర్మ, జీవరత్నం, జయంత్, అప్పలనాయుడు ప్రసన్న కుమార్, ధనుంజయలను పరామర్శించి సానుభూతి తెలిపారు.

ఉపాధ్యాయ పండిత పరిషత్ నూతన కార్యవర్గం ఎన్నిక

పోలాకి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు ఆ సంఘ నాయకుడు జి.వీరాస్వామి తెలిపారు. అధ్యక్షుడిగా పి ట్ట.గంగన్న, ఉపాధ్యక్షులుగా వి.రమణమూర్తి, ఎస్.రమణయ్య, జి.సూర్యారావు, ఎస్.మురళీ, ఆర్.సవరాజు, రాష్ట్ర కౌన్సిలర్లుగా జి.వీరాస్వామి, టి.మురళీకృష్ణలను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా వెంకటరమణ, బాబూరావు, ధనుంజయ, జోగారావులను ఎన్నుకున్నారు. జీవో 117ను రద్దు చేయాలని, పీఆర్సీ ప్రకటించాలని, బకాయి డీఏలను చెల్లించాలని వారు కోరారు.

సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాలి

కోటబొమ్మాళి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో సనాతన ధర్మాన్ని పరిరక్షించు కోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పార్వతీపురానికి చెందిన గీతా ప్రచారకులు కంజుమూజు రామమోహనరావు, టెక్కలికి చెందిన నర్సింహ స్వామి, వీహెచ్‌పీ ప్రతినిధి యోగా చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం ఊడికలపాడు శ్రీరామమందిరంలో శ్రీరామకృష్ణ రమణాకరుణ గీతాశ్రమం నిర్వా హకుడు సనపల కరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దైవభక్తి కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఐక్యతతో మెలగవచ్చన్నారు. అంతకు ముందు కోటబొమ్మాళి ఆర్యసమాజం వారిచే గాయత్రీ మహాయజ్ఞం ఘనంగా నిర్వహించారు. వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో స్థానికులు సీపాన అన్నయ్య, రత్నాలమ్మ, హనుమంతు సత్యనారాయణ పాల్గొన్నారు.

మరింత 'ఉపాధి'

(ఐదో పేజీ తరువాయి)

అందించేందుకుగానూ.. సంబంధిత పనులు, సమయం కేటాయింపు అంశాలను జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన వేతన పర్యవేక్షణ విభాగం పరిశీలించ నుంది. అలాగే ఉపాధిహామీ పనుల్లో బోగస్ మస్తర్ల బాగోతం నడుస్తుందనే విమర్శలు ఉన్నాయి. కూలీలు పనులకు రాకపోయినా.. హాజరైనట్టు కొంతమంది సిబ్బంది మేనేజ్ చేసి.. వేతనాలు స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటువంటి బోగస్ మస్తర్ల బాగోతానికి పర్యవేక్షణ విభాగం చెక్ పెట్టనుంది.

నిబంధనలివే..

● ఉపాధిహామీ కూలీలకు రోజువారీ వేతనం సగటున రూ.300 పెంచేందుకు ప్రభుత్వం పలు నిబంధనలను జారీ చేసింది. ప్రధానంగా పనుల గుర్తింపు, పనిప్రదేశాలకు అనుగుణంగా చేపట్టాలి. ముందస్తుగా అంచనాలు తయారు చేయాలి. నేలస్వభావం, కూలీలు పనిచేయడానికి సానుకూలంగా ఉండేలా గుర్తించాలి. జిల్లాను యూనిట్‌గా తీసుకుని పనులు కల్పించాలి. గ్రామాల్లో ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించాలి. పనివేళల్లో మార్పులు చేయాలి. టెక్నికల్ అసిస్టెంట్లు నిత్యం మానిటరింగ్ చేయాలి. ఏపీడీ, ఏపీవో, ఎమ్పీడీవోలు మస్టర్లను తనిఖీ చేయాలి. వేతనదారులు పనివేళలు, కొలతలు పారదర్శకంగా లెక్కించాలి. వేతనదారులకు చెల్లించే వేతనాల రసీదులు కచ్చితంగా ఇవ్వాలి.